క్లుప్తంగా

లెనిన్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

దురాజ్‌పల్లి : కమ్యూనిస్టు విప్లవయోధుడు లెనిన్ 99వ వర్ధంతిని శనివారం సూర్యాపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, అనంతుల మల్లేశ్వరి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, సూర్యాపేట పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

26న నిరసన

నూతనకల్ : వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆందోళనలో అసువులు బాసిన రైతుల సంస్మరణార్థం ఈ నెల 26న నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గతేడాది జనవరి 26న ఢిల్లీలో శాంతియుతంగా నిర్వహిస్తున్న ట్రాక్టర్ ర్యాలీపై పోలీసులు బాష్పవాయువు ఉపయోగించి రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆయన తెలిపారు. ఈ నెల 26న మండల కేంద్రంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, మద్దెల రామ్మూర్తి, లింగయ్య, రవి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో జయ ఐఐటీ ఒలింపియాడ్ నుంచి 17 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రెండో లెవల్‌కు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

జానకిరాములు ఆశయ సాధనకు కృషిచేయాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : మునగాల మండల విజయరాఘవపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు అలువాల జానకిరాములు ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎలుగురి గోవింద్, జె. నర్సింహారావు, చినపంగి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ అభినందనీయం

సూర్యాపేట : పేదలకు సేవ చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆర్‌సీ చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి రాచకొండ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార వితరణలో వారు పాల్గొని మాట్లాడారు. ఇండియన్ గ్యాస్ అధినేత తోట శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన తండ్రి తోట రంగారావు వర్ధంతి సందర్భంగా శనివారం ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో రంగారావు కూతురు సీలిమ, నిర్వాహకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనపై అవగాహన

తుంగతుర్తి : 2023–2028 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సంగెం గ్రామంలో మహిళా సంఘాలకు శనివారం పేదరిక నిర్మూలన, మహిళ సంఘాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. సందర్భంగా ఐదు సంవత్సరాల విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఏఓ కాకులారపు లక్ష్మి, మాల్యాల సుజాత, సరిత, మార్తమ్మ, సృజన్, రాములు, విజయ్, రవి, మల్లయ్య, సత్తిరెడ్డి, లింగయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- కంకరతేలి గుంతలమయంగా మారిన తిరుమలగిరి–తాటిపాముల రహదారి
- ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కంకర తేలి ప్రమాదకరంగా మారిన తిరుమలగిరి, తాటిపాముల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రం నుంచి తాటిపాముల గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును 10ఏళ్ల క్రితం నిర్మించారు. కానీ రోడ్డు నిర్మాణం నాసి రకంగా చేపట్టడంతో కొన్ని రోజులకే కంకర తేలి గుంతలమయంగా మారింది. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా మారింది. నిత్యం ఈ రోడ్డుపై అనేక మంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. కానీ రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏడు కిలో మీటర్ల దూరం ఉండే ఈ రహదారంతా ధ్వంసమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా తాటిపాముల గ్రామస్తులు జనగామ జిల్లా మొండ్రాయి నుంచి తిరుమలగిరికి వెళ్లాల్సి వస్తోంది.

వర్షా కాలంలో మరిన్ని ఇబ్బందులు..

తాటిపాముల గ్రామం నుంచి వివిధ అవసరాలకు తిరుమలగిరికి వెళ్లేందుకు ప్రతిరోజు అనేకమంది ఈ రహదారి గుండానే వెళ్తుంటారు. కానీ రోడ్డు మొత్తం కంకర తేలి గుంతలుగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా మారుతుంది. గుంతల్లో నీరు చేరుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

తాటిపాముల, తిరుమలగిరి రహదారి మరమ్మతుల కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే రోడ్డుకు మరమ్మతు పనులు చేపడతాం. – రవికుమార్, ఏఈ

రోజూ ఇబ్బంది పడుతున్నాం



ప్రతిరోజు గ్రామం నుంచి వందలాది మంది వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్తుంటారు. కానీ రోడ్డుపై కంకర తేలి గుంతలు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. – యాదగిరి, తాటిపాముల

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామ శివారులో 493, 494 సర్వే నంబర్‌లలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతుందని, ఈ భూమిని కాపాడాలని కోరుతూ గ్రామ రైతులు పార్టీలకు అతీతంగా కలిసి శనివారం అర్వపల్లిలో తహసీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. గ్రామ శివారులోని 493, 494 సర్వే నంబర్‌లలోని భూమిని ఎన్నో ఏళ్లుగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి వినియోగిస్తున్నామని చెప్పారు. కానీ ప్రస్తుతం ఈ భూమి ఆక్రమణలకు గురవుతుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఈ ప్రభుత్వ భూమికి హద్దురాళ్లు పాతి కాపాడాలని కోరారు. ఈ భూమిలో రైతులకు ఉపయోగకరంగా ఉండే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ పీరమ్మ, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, పొట్టిపాక సైదులు, ఓర్సు వెంకన్న, దోరెపల్లి వెంకటయ్య, వజ్జె శ్రీనివాస్, సైదులు, మల్సూర్, శ్రీరాములు, తవిటి వెంకన్న, తూటిపల్లి ఎల్లయ్య, భీముడు, లింగయ్య, ఎ.సైదులు, పున్నయ్య, లింగయ్య, లింగస్వామి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీలో పలువురి చేరిక



బీఎస్పీలో చేరుతున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల నుంచి పలువురు శనివారం బహుజన సమాజ్ పార్టీలో చేరారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన లింగరాజుయాదవ్, కునుకుంట్ల శంకర్, తోట సతీష్, నాగారం మండలం నుంచి వెంకన్న, ఈదయ్యలతోపాటు మరికొంత మంది బీఎస్పీలో చేరగా వారికి జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దందోలు తిరుపతి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు కమటం శోభ, మండల ఇన్‌చార్జ్ చెర్కుపల్లి లక్ష్మణ్, డాక్టర్ చింతకుంట్ల రామస్వామి, దాసరి రాములు, న్యాయవాది మహేష్, జీడి వెంకన్న, ఉపేందర్, వెంకట్, యాదగిరి, రవీందర్, లక్ష్మణ్, ప్రశాంత్, లింగరాజు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న

మద్దిరాల : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లోని సమస్యలను సభలో ప్రస్తావించారు. గ్రామాల్లో ప్రధానంగా విద్యుత్, పారిశుద్ధ్యం, మంచినీటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ అమీన్‌సింగ్, మండల వైద్యాధికారి శృతి, అధికారులు శ్రీజ, వికాస్‌పాటిల్, నవకాంత్, స్రవంతి, ఆసిఫా, సర్పంచ్‌లు లౌవుడ్యా వెంకన్న, దామెర్ల వెంకన్న, వల్లపు యాకయ్య, వెలుగు వెంకన్న, ఎంపీటీసీలు శిరంశెట్టి వెంకన్న, అవిలయ్య, కోఆప్షన్ సభ్యులు సొహెభూషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి, ఎమ్మెల్యే రాక

అర్వపల్లి : తిమ్మాపురంలో నూతనంగా నిర్మించిన మసీదు ప్రారంభోత్సవానికి విద్యుత్ శాఖమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదివారం హాజరుకానున్నారని మసీదు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కేసారం, కాసరబాద గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం, ఓపెన్ జిమ్ సెంటర్లు, గ్రామ పంచాయతీ కార్యాలయం, పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ చలిగంటి నరేష్

సూర్యాపేటక్రైం : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ చలిగంటి నరేష్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో బజాజ్ మోటార్ ప్లాటినం 110 ఏబీఎస్ వాహనాన్ని ప్రారంభించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం బజాజ్ షోరూం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్మెట్లను వాహనదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీకాంత్ నాయక్, అశోక్, వెంకటేశ్వర్లు, బజాజ్ షోరూం ఇన్‌చార్జ్ సంతోష్, నవీన్, ప్రవీణ్, సుధాకర్, మనోజ్ బాబు, సాయి సన్‌సాయి టీం సభ్యులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం పెంపొందుతుంది



వెయ్యిస్తంభాల గుడి వద్ద ఉపాధ్యాయులతో విద్యార్థులు

మద్దిరాల : విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని హెచ్‌ఎం శివయ్య అన్నారు. విజ్ఞాన విహారయాత్రలో భాగంగా చిన్ననెమిల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులను శనివారం రామప్ప, లక్నవరం, వెయ్యిస్తంభాల గుడి, వరంగల్ ఖిలా, మేడారం, భద్రకాళి దేవాలయం వంటి చరిత్రాత్మక ప్రాంతాలకు తీసుకెళ్లి వాటి విశిష్టతపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకయ్య, శ్రీనివాస్, హస్రున్, ఉపేందర్‌రెడ్డి, సాల్మన్, ప్రదీప్‌కుమార్, మధూకర్, అవిలయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చీదెళ్ల గ్రామంలో చెత్తను తరలిస్తున్న సిబ్బంది

పెన్‌పహాడ్ : పల్లెల్లో వందశాతం పారిశుద్ధ్యం కోసం గ్రామస్తులు, పారిశుద్ధ్య సిబ్బంది కృషి చేస్తున్నారు. దీంతో గ్రామాలు స్వచ్ఛత దిశగా పరుగులెడుతున్నాయి. మండలంలోని అనంతారం, చీదెళ్ల, సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామస్తులు అందరికీ ఆరోగ్యం పేరిట పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు గ్రామస్తులను చైతన్యం చేస్తున్నారు. ఇళ్లలోని తడి చెత్త పొడి చెత్తను వేరుచేస్తూ గ్రామ పంచాయతీలకు చెందిన ట్రాక్టర్లలో వేసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లల్లో చెత్తాచెదారం నిల్వ ఉంచకుండా, పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, దోమలు స్వైరవిహారం చేయకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లోని డ్రైనేజీల వెంట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి దోమలను నివారించి, దుర్గంధాన్ని దూరం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులపై మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా కృషి చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆయా గ్రామాల్లో తడిచెత్త, పొడి చెత్తపై ఇంటింటా అవగాహన కల్పిస్తున్నాం. చెత్తాచెదారాన్ని పంచాయతీ ట్రాక్టర్ల సాయంతో గ్రామాల్లోని ఊరి చివరన డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నాం. – బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

ప్రత్యేక దృష్టి సారించాం



గ్రామంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాం. గ్రామంలోని 12వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బంది, అధికారుల సహాయంతో ప్రధాన రోడ్లపైన చెత్తాచెదారం లేకుండా చూస్తున్నాం. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. – పరెడ్డి సీతారాంరెడ్డి, సర్పంచ్, చీదెళ్ల

పరిశుభ్రతతో ఆరోగ్యం



గ్రామంలో పరిసరాల పరిశుభ్రతతో అందరికీ ఆరోగ్యం సాధ్యమవుతుంది. గ్రామంలోని వీధుల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – సంజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, చీదెళ్ల

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో బహుమతులు ప్రదానం చేస్తున్న కడియం రామచంద్రయ్య

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం కడియం సోమక్క చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కడియం రామచంద్రయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంచడానికి నిర్వహిస్తున్న నరేంద్రమోదీ పరీక్ష వారియర్స్ పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, ఉపేంద్ర, రాజేశ్వరి, బుద్ధప్రసాద్, సి.వీరన్న, వెంకన్న, దీన్‌దయాళ్, యాదగిరి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, కొండ సోమయ్య పాల్గొన్నారు.

కళాత్మక నైపుణ్యం పెంపొందించాలి

నాగారం : విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యం పెంపొందించాలని బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, కడియం సోమక్క చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కడియం రామచంద్రయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో కడియం సోమక్క చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లల్లో మనోధైర్యం, జ్ఞాపక శక్తిని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పరీక్ష వారియర్స్ అనే పుస్తకాన్ని రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అనంతుల సోమేష్, మంగదుడ్ల రమేష్, కిరణ్, మేడబోయిన యాదగిరి, దీన్‌దయాళ్, ప్రధానోపాధ్యాయుడు పి.వెంకన్న, ఉపాధ్యాయులు సోమాచారి, రఫీ, నవీన్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రఘు, సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న కందగట్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని కందగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధించి అలరించారు. పలువురు జిల్లా అధికారుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని గట్టికల్ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి విద్యార్థిని బండగొర్ల భవ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా తండ్రి కీ.శే. బండగొర్ల సుధాకర్ జ్ఞాపకార్థం శనివారం పాఠశాలలో 55మంది విద్యార్థులకు ప్లేట్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వరుపారాణి, ఉపాధ్యాయులు రంగా జగన్, చిన్నారి తల్లి బండగొర్ల సుమలత పాల్గొన్నారు.

23న ఇసుక వేలం

నూతనకల్ : తాళ్లసింగారం గ్రామం శివారులో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపులకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీజ్ చేసిన 320ట్రిప్పుల ఇసుకకు నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనే వారు వేలం అనంతరం పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించాలని సూచించారు.

సీఐటీయూ డైరీ ఆవిష్కరణ

నాగారం : భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్‌ఐ జి.ముత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతుల మల్లయ్య సీఐటీయూ డైరీని ఎస్‌ఐ ముత్తయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎల్ల పాపయ్య, బోడ చంద్రయ్య, ఎల్లేష్, వంగాల శేఖర్, మల్లేపాక సోమయ్య, కడియం కుమార్, దేవరకొండ మురళి, తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ జి.ముత్తయ్య

ఆలయంలో అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఉన్న గంగా పార్వతీ సమేత శివ సాయి దేవాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. త్రిమూర్తులు ఉన్న రావిచెట్టు, వేప చెట్టు, మేడిచెట్టుకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నవరాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు శంకర్ లాల్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీపాద జానకిరాములు, పూజారులు వలివేటి విశ్వేశ్వర శర్మ, మామిళ్లపల్లి గంగాధర్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి : తిరుమలగిరిలో ఫిబ్రవరి 1న నిర్వహించే ఐఎఫ్‌టీయూ జిల్లా కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఈర్లాల వెంకన్న కోరారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ నాయకులు కర్ణాకర్, వేల్పుల యాదగిరి, కృష్ణ, పరశురామ్, భిక్షం, మహేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో ఉన్న ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన విలాసకవి సత్యంరాజు నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు విలాసకవి ప్రసాద్‌రాజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుపాముల గ్రామసర్పంచ్ కేశగాని వెంకటేశ్వర్లు, నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రసాద్‌రాజు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రసాదరాజు మిత్రులు పోలంపల్లి వెంకట్రామయ్య, పోలంపల్లి వెంకటేశ్వర్లు, బక్క నాగేశ్వరరావు, కాసాని వెంకటనారాయణ, సంపెట ఉపేందర్, షేక్ రషీద్, సంపెట కోటేశ్వరరావు, షేక్ నూర్‌ఖాన్, లక్ష్మణ్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నాగారం : మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, 50కేజీల బియ్యాం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేడబోయిన యాదగిరి, దీన్‌దయాళ్, అనంతుల సోమేష్, మంగదుడ్ల రమేష్, బొబ్బలి కిరణ్, వంగూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల కేంద్రానికి చెందిన చేను లత, చిప్పలపల్లి సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ వడ్డేపల్లి రవి శనివారం మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బాధిత కటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, మంగదుడ్ల దశరథ, నరేష్, సోమయ్య, సాయి, యాకస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో పశు వైద్యశిబిరం



రామచంద్రాపురంలో పశువులకు గర్భకోశ పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారులు

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి గోపి అన్నారు. శనివారం రామచంద్రాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి అనిల్, సిబ్బంది సత్తార్, తిరుమలేష్, లక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.